క్లుప్తంగా

ఈ నెల 10న నేషనల్ లోక్‌అదాలత్

కేసుల రాజీకి మరో అవకాశం

ముషీరాబాద్: జూన్ 10 న కోర్టులో నేషనల్ లోక్ అదాలత్ ఉందని తెలిసిన వారిపై పెట్టీ, ఇతర కేసులు ఉన్నట్లైతే వాటిని రాజీ చేసుకోవాలని ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జహంగీర్ యాదవ్ ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాజీచేసుకునే ఇరువర్గాలు జూన్ 6 నుంచి జూన్ 10వ తేదీలోపు ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు హాజరైనట్లైతే వారిని కోర్టులో ప్రవేశపెట్టి ఆ కేసును పూర్తిగా పరిష్కరిస్తామన్నారు. లోక్ అదాలత్‌లో క్రిమినల్, పెట్టీ, కుటుంబ, భూతగాదాలు, సివిల్ తదితర కేసులకు రాజీ చేసుకుని కేసును పూర్తిగా క్లోజ్ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫిర్యాదుదారుడు, నిందితుడు ఇద్దరు తమ ఆధార్‌కార్డులను తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు రావాలని సూచించారు.

బోర్‌వెల్ పనులు ప్రారంభం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లి లంబాడితాండ డబుల్‌బెడ్‌రూమ్ భవనం వద్ద ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆర్వోప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం పూజ నిర్వహించి బోర్‌వెల్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్వోప్లాంట్ ఏర్పాటుతో ప్రజలకు శుద్ధి చేసిన తాగునీటిని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. బస్తీ అధ్యక్షులు కల్యాణ్‌నాయక్, దేవేందర్‌నాయక్, హరి, బాబు తదితరులున్నారు.

సునీల్ బన్సల్‌ను కలిసిన బీజేపీ నేతలు



సునీల్‌బన్సల్‌తో బీజేపీ నాయకులు

ముషీరాబాద్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఇన్‌చార్జ్ సునీల్‌బన్సల్‌ను స్థానిక బీజేపీ నాయకులు సూర్యనారాయణశర్మ, శేషసాయి మర్యాదపూర్వకంగా బీజేపీ నగర కార్యాలయంలో మంగళవారం కలిశారు. బీజేపీ అభివృద్ధి కోసం తాము చేస్తున్న కృషిని బన్సల్‌కు వివరించామని ఈ సందర్భంగా ఆయన చేసిన సూచనలు, సలహాలను పాటించి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయానికి తమ శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

కుటుంబ అనుబంధాలు, విలువలు నేర్పించండి !



పురస్కారం అందజేస్తున్న రమణాచారి

చిక్కడపల్లి: నేటి తరాలకు కుటుంబ అనుబంధాల విలువలు నేర్పితేనే భవిష్యత్ తరాలకు అవి అందుతాయని లేకుంటే వ్యవస్థల ఉనికే ఉండదని ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రామణాచారి అన్నారు. మంగళవారం రాత్రి త్యాగరాయగానసభ ప్రధాన వేదికపై వాసా ఫౌండేషన్ కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ సంయుక్తంగా ప్రముఖ రచయిత్రి డాక్టర్ వాసాప్రభావతి జయంతి సభలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాస ప్రభావతి జీవన సాఫల్య పురస్కారం సాహితీవేత్త ఆచార్య ఎల్లూరి శివారెడ్డికి, గురు పురస్కారం ప్రముఖ రచయిత్రి కాత్యాయని విద్మహేలకు రమణచారి బహూకరించి మాట్లాడారు. ఎల్లూరి శివారెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడిగా పనిచేశారన్నారు. కాత్యాయని మహిళా అభ్యుదయ రచయిత్రిగా గుర్తింపు పొందారని కొనియాడారు. సాహితీవేత్త వోలేటి పార్వతీశం, పొత్తూరి సుబ్బారావు, అలూరి విజయలక్ష్మి, ప్రకాష్, మీనాక్షిలు పాల్గొన్నారు.

దామోదర్ గుప్తాకు సత్కారం

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌ను వాసవీ ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు డాక్టర్ నీలా శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయమని డాక్టర్ నీలా శ్రీధర్ వివరించారు. బీఆర్‌ఎస్ నేతలు ఎర్రం శ్రీనివాస్, వాసవి సేవా కేంద్రం మాజీ అధ్యక్షుడు కాసనగొట్టు రాజశేఖర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సూరజ్‌నగర్‌లో పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఓ రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం కాచిగూడ డివిజన్ చెప్పల్‌బజార్ దశరథ్‌గల్లిలో రూ.18 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను, నింబోలిఅడ్డ లాల్ బంగ్లాసూరజ్‌నగర్‌లో రూ. 10.07 లక్షలతో డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని స్థానిక బస్తీల్లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, బీఆర్‌ఎస్, బీజేపీనేతలతో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని ప్రధాన సమస్యలను ఒక్కోటి పరిష్కరిస్తామన్నారు. పనుల నాణ్యతలో నిర్లక్ష్యం వహిస్తే కాంట్రాక్టర్, సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు మరిన్ని మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. జలమండలి డీజీఎం సన్యాసిరావు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు సారిక, భావన, రఘు, కార్తీక, వెంకటేష్‌యాదవ్, రాము, బీఆర్‌ఎస్ నేతలు డాక్టర్ బద్దుల శిరీష ఓంప్రకాష్‌యాదవ్, ఎర్ర భీష్మదేవ్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, కె.సదానంద్, సునిల్‌బిడ్లాన్, కృష్ణాగౌడ్, మన్నె శ్రీనివాస్‌యాదవ్, శ్రీకాంత్, ఆంటో, బబ్లూసింగ్, బీజేపీనేతలు కన్నె రమేష్‌యాదవ్, సుభాష్ పటేల్, భీంరాజ్, ఎస్.రవి యాదవ్, ప్రతిభ, మల్లికార్జున్, సత్యనారాయణ, వాసు, దిలీప్, రాజ్‌కుమార్, తిలక్, మహేష్, ఆర్.సంతోష్, శివ, సూరి, రాజేష్, సంజయ్, సాయిదీప్, దినేష్, ఓంప్రకాష్ తదితరులున్నారు.

నాలా వాసులకు నష్టం కలగకుండా పనులు చేపట్టాలి



నాలా ప్రాంతవాసులతో ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధికారులు

చిక్కడపల్లి: సబర్మతినగర్ నాలా ప్రాంత వాసులకు ఎలాంటి నష్టం కలగకుండా పనులు చేపట్టాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం గాంధీనగర్ డివిజన్‌లో సబర్మతినగర్ ప్రాంత వాసులకు ఎలాంటి నష్టం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఈఈ ప్రవీణ్, ఏఈ శ్యామ్‌సుందర్, బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులు ముఠాజైసింహ, జీవై.గిరి, ఎండీ గౌస్, ముచ్చకుర్తి ప్రభాకర్, తుడుంరాజేందర్, ఆనంద్, చందు, చాణిక్యరెడ్డి తదితరులున్నారు.

24 గంటల విద్యుత్ బీఆర్‌ఎస్ ఘనతే !



విద్యుత్ ఉద్యోగులను సత్కరిస్తున్న మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి

కవాడిగూడ: దేశంలో ఎన్నడూ లేని విధంగా వ్యవసాయం, పరిశ్రమలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్తును ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 24 గంటల విద్యుత్‌ను రాష్ట్రంలో అమలు చేసి తన నిజాయితీని ఆయన నిరూపించుకున్నారన్నారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కవాడిగూడలోని దోమలగూడ సబ్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు కల్వగోపి ఆధ్వర్యంలో టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ డీఈ హేమచంద్ర, ఏడీఈ ఆపరేషన్స్ సయ్యద్ ముక్సూద్, శ్రీనివాస్, ఏఏడీ రామకృష్ణలతో పాటు ఏఈలు, సిబ్బందిని ఆయన ఘనంగా సత్కరించారు. తెలంగాణ ఉద్యమంలో విద్యుత్ ఉద్యోగుల పాత్ర ఎంతో గొప్పదని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు నేత శ్రీనివాస్, నాయిని, మల్లేష్, వెంకటేశ్వర్‌రావు, సిరిగిరి శ్యామ్, కిరణ్, భిక్షపతియాదవ్, బాలయ్య, రమేష్, కార్తీక్‌యాదవ్, సదా, శివ, మధు, వెంకటేష్, సత్యనారాయణ, రాహుల్, శంకర్, సాయి యాదవ్, సాయి, త్రినాథ్, అజ్జు, వంశీ, విద్యుత్ అధికారులు ఏఈలు నర్సింగ్‌రావు, సుధామ, జే.పవన్, సత్యప్రసాద్, సబ్ ఇంజినీర్లు ప్రభకుమార్, విశ్వనాథం సమీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కళా సాహిత్యకేంద్రం త్యాగరాయ గానసభ



మంజులను సన్మానించిన శంకరనారాయణ, కేవీరావు, కళా జనార్దనమూర్తి తదితరులు

చిక్కడపల్లి: సంగీత నృత్యనాటక సాహిత్య కార్యక్రమాలకు కేంద్రంగా త్యాగరాయగానసభ జంట నగరాల్లోనే కాకుండా దేశ వ్యాప్తంగా పేరు పొందిందని ప్రముఖులు పేర్కొన్నారు. మంగళవారం త్యాగరాయ గానసభ 58వ వ్యవస్థాపక దినోత్సవంగా సభలోని కళా లలిత కళావేదికపై జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ జర్నలిస్టు, హాస్యఅవధాని శంకర నారాయణ పాల్గొని మాట్లాడారు. సాధారణంగా కళా వేదికలు సాంస్కృతిక కార్యక్రమాలకు నిలయాలు. గానసభ కళా ప్రదర్శనలకే కాకుండా పేద వర్గాల వారికి వివాహాల కోసం సహకరించటం, వైద్య శిబిర నిర్వహణ వంటి సేవా కార్యక్రమాలు చేయడం విశేషమన్నారు. ఘంటసాల గానసభ అధ్యక్షుడు డాక్టర్ కేవీరావు, గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, శంకర్‌ప్రసాద్, మంజుల తదితరులున్నారు. మంజుల శిష్యబృందం త్యాగరాజ కీర్తనలు ఆలపించగా సభికులను అలరించింది.

రేపు హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పీపుల్స్ ఎడ్యూకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పల్లె నాగేశ్వర్‌రావుకు ఈనెల 8న నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీ ఎన్టీఆర్ ఆడిటోరియంలో సన్మాన కార్యక్రమం ఉంటుందని సంస్థ అధ్యక్షుడు సీ.హెచ్.బాలకృష్ణ ప్రకటించారు. ముఖ్య అతిథులుగా హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎం.జీ.ప్రియదర్శిని, జస్టిస్ బీమపాక నాగేష్, బుద్ధవనం ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్ మల్లేపల్లి లక్ష్మయ్య, టీఎస్‌పీఎస్‌ఈ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ గంట చక్రపాణి, ఏసీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.చేతన, రిటైర్డ్ జడ్జీ నిమ్మ నారాయణ, జేబీ రాజు తదితరులు పాల్గొననున్నట్లు సమాచారం.

బోనాల నిధులకు ఈ నెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలి

కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వం బోనాల వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోందని ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ ఎం.రామకృష్ణారావు తెలిపారు. బర్కత్‌పుర తుల్జాభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. బోనాల వేడుకలకు ప్రభుత్వం ఆలయాలకు నిధులను సమకూర్చుతోందని నిర్వాహకులు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని ఆలయాల నిర్వహకులు గతేడాది యూసీతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వ్యక్తి అదృశ్యం

కాచిగూడ: పుణ్యక్షేత్రానికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ చోటుచేసుకుంది. అడ్మిన్ ఎస్సై హెచ్. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ చెప్పల్ బజార్ ప్రాంతానికి చెందిన గొల్లపల్లి సంతోష్(28) ఈనెల 2న యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రానికి వెళ్తానని భార్య స్వాతితో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన భార్య తెలిసిన వారు, బంధువులను విచారించినా భర్త ఆచూకీ లభించలేదు. దీంతో భర్త కనిపించడంలేదంటూ.. స్వాతి మంగళవారం సాయంత్రం కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపార్టుమెంట్ పైనుంచి పడి రిటైర్డ్ వెటర్నరీ డాక్టర్ మృతి



వివరాలను సేకరిస్తున్న దోమలగూడ ఎస్సై సాయికృష్ణ

చిక్కడపల్లి: మానసిక స్థితి సరిగా లేక ఓ రిటైర్డ్ వెటర్నరీ డాక్టర్ అపార్ట్‌మెంట్‌లోని ఆరో అంతస్తు టెర్రస్ నుంచి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. ఈ ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. దోమలగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దొంతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దోమలగూడ గగన్‌మహల్‌లోని అరవిందరెసిడెన్సీ ఐదో అంతస్తులో నివాసం ఉండే ఎం. కేశవరెడ్డి (87), భార్య సక్కుబాయి (78). వీరికి ఇద్దరు కుమారులు ఓ కుమార్తె ఉన్నారు. పెద్దకుమారుడు ఉదయ్‌కుమార్ రెడ్డి వ్యాపారవేత్త మాదాపూర్‌లో నివాసం ఉంటుండగా.. చిన్నకుమారుడు భార్గవ్, కుమార్తె కొండేటి నిరంజన్‌రెడ్డిలు అమెరికాలో ఉంటున్నారు. గత ఐదేళ్లుగా రిటైర్డ్ వెటర్నరీ డాక్టర్ కేశవరెడ్డి మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో కేశవరెడ్డి కూతురు నిరంజనిరెడ్డి వంట చేస్తుండగా.. కేశవరెడ్డి ఎవరికి చెప్పకుండా ఐదో అంతస్తు నుంచి ఆరో అంతస్తులో ఉన్న టెర్రస్ పైకి వెళ్లాడు. కిందకు తొంగి చూస్తుండగా.. ప్రమాదవశాత్తు కిందపడి అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న దోమలగూడ ఎస్సై సాయికృష్ణ సిబ్బందితో కలిసి క్లూస్ టీం రప్పించి, సీసీపుటేజీల ద్వారా ఆయన మృతికి గల కారణం వివరాలను సేకరించారు. సీసీ పుటేజీలో ప్రమాదవశాత్తు పడిపోయినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వాణిజ్య పంటలతో ఆహార భద్రతకు ముప్పు

ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అంతర్జాతీయ సామ్రాజ్యవాదులకు తలొగ్గుతున్న నయా పాసిస్టు భారత ప్రధాని నరేంద్ర మోదీ అని ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు ప్రభాత్ పట్నాయక్ విమర్శించారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో అరబండి లక్ష్మీనారాయణ 5వ స్మారకోపన్యాసం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ప్రభాత్‌పట్నాయక్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని సరుకుగా మార్చడమే లక్ష్యంగా సామ్రాజ్యవాదులు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. దానికి అనుగుణంగా బీజేపీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చిందని గుర్తు చేశారు. అందుకే రైతులు పోరాడి ఆ చట్టాలను వెనక్కి తిప్పికొట్టారన్నారు. వాణిజ్య పంటలతో ఆహారభద్రతకు పెను ముప్పు ఉందన్నారు. దేశ ప్రజల అవసరాలు తీరుస్తూనే విదేశాలకు ఎగుమతులు చేసే స్థాయికి ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు క్రిష్ణన్ మాట్లాడుతూ రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, వ్యవసాయ ఉత్పత్తులకు 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయిస్తామంటూ మోదీ ఇచ్చిన హామీలు నెరవేరడం లేదన్నారు. వ్యవసాయ రంగ నిపుణులు డాక్టర్ జానయ్య, ఏఐకేఎస్ జాతీయ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, తెలంగాణ రైతు సంఘం అధ్యక్షులు పి.సుదర్శన్, ప్రధాన కార్యదర్శి టి.సాగర్, సహాయ కార్యదర్శి శోభన్, రైతు సంఘం ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, నంద్యాల నర్సింహ్మారెడ్డి, అరబండి ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ అరబండి మనోహర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్లకు జీతాలు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.ఎల్.పద్మ

ముషీరాబాద్: ఐఎఫ్‌టీయూ అనుబంధ ప్రగతిశీల కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల నాన్‌టీచింగ్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో సోమ,మంగళవారాల్లో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎల్.పద్మ అధ్యక్షతన జరిగింది. కేజీబీవీలో పనిచేస్తున్న నాన్‌టీచింగ్, వర్కర్లకు కనీస వేతనాలు అమలుకావడం లేదని పీఆర్‌సీ నివేదిక ప్రకారం బేసిక్ పేస్కేల్ నిర్ణయించి జీతాలు పెంచాలన్నారు. నాన్‌టీచింగ్ వర్కర్లకు ఉద్యోగ భద్రతతో పాటు మెడికల్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఎస్.ఎల్.పద్మ డిమాండ్ చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రి సబితాఇంద్రారెడ్డి, స్కూల్ ఎడ్యూకేషన్ ప్రిన్సిపాల్ సెక్రటరీ వాకాటి కరుణాలను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్, రాష్ట్ర కమిటీ నాయకులు మధుర, అరుణ, హేమలత, సుధాకర్, అశోక్, సైదమ్మ, సుమలత, వీరమణి తదితరులున్నారు.

గ్రూప్–1, ప్రిలిమ్స్ మాదిరి ప్రశ్నపత్రాల ఉచిత పంపిణీ



ప్రశ్న పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

చిక్కడపల్లి: టీఎస్‌పీఎస్సీ జూన్ 11న నిర్వహిస్తున్న గ్రూప్–1 ప్రిలిమ్స్–పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు యూపీఎస్సీ యూనివర్స్ మాదిరి ప్రశ్నపత్రాలను మంగళవారం అశోక్‌నగర్‌లో ఉచితంగా పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం 80 వేలకు పైగా ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చిందని దీనిని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠాజైసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీధర్‌రెడ్డి తదితరులున్నారు.

రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాల్లో సెంట్రల్ పీస్ కమిటీ

కాచిగూడ: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న వేడుకల్లో సెంట్రల్ పీస్ కమిటీ ప్రతినిధులు పాల్గొని పూర్తి స్థాయిలో ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు పీస్ కమిటీ ప్రధానకార్యదర్శి కిషన్ శర్మ, అసిస్టెంట్ సెక్రటరీ ఎస్.శరత్ శ్యామ్ తెలిపారు. మంగళవారం బర్కత్‌పురలో వారు మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో తెలంగాణ ప్రజలందరూ సంతోషంగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ పీస్ కమిటీ ప్రతినిధులు ఎస్.నారాయణరెడ్డి, డాక్టర్ మజారోద్దీన్, శశికాంత్ అగర్వాల్, డాక్టర్ యూసుఫ్ అహ్మద్, మోజం, తేజోకుమారి తదితరులు పాల్గొన్నారు.



కమిటీ ప్రతినిధులు ఎన్. శరత్‌శ్యామ్ తదితరులు

అన్నిరంగాల్లో కంప్యూటర్ల పాత్ర కీలకం



విద్యార్థులతో కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి

నల్లకుంట: కంప్యూటర్లు అన్ని రంగాలల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయని సెయింట్ మేరీస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి అన్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో కంప్యూటర్‌లేని వ్యవస్థ, రంగం ఏదీలేదని కంప్యూటర్‌లేని జీవితాన్ని ఊహించుకోవడం కష్టమన్నారు. న్యూ నల్లకుంట లింగాలగడ్డ శివాలయం సమీపంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లను సోమవారం పాఠశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీలక్ష్మి, అధ్యాపకులు స్వరూప, అర్చన, విజయలక్ష్మి, అలేఖ్య, సరిత, మాయ తదితరులున్నారు.

పారిశ్రామిక అభివృద్ధికి సంస్కరణలు ఆదర్శం



గోల్నాకలో పారిశ్రామిక వేత్తలను సత్కరిస్తున్న ఎడ్ల సుధాకర్‌రెడ్డి

అంబర్‌పేట: తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న సంస్కరణలను యావత్ ప్రపంచం ప్రశంసిస్తోందని బీఆర్‌ఎస్ అంబర్‌పేట్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం గోల్నాకలో పలువురు పారిశ్రామికవేత్తలను ఆయన ఘనంగా సత్కరించారు. పారిశ్రామికవేత్తలను తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందన్నారు. మాజీ కార్పొరేటర్ పులి జగన్, సీనియర్ నాయకులు రమేష్, మురళీకృష్ణ, నాగేష్‌గౌడ్, సుశీలరెడ్డి, దేవిరెడ్డి, విజితారెడ్డి, జీవన్‌గౌడ్ తదితరులున్నారు.

జిందాతిలిస్మాత్ కంపెనీలో..



జిందాతిలిస్మాత్ కంపెనీ కార్మికులతో మాజీ కార్పొరేటర్ పద్మావతిరెడ్డి

● దేశంలోనే అత్యంత పురాతనమైన ప్రముఖ జిందాతిలిస్మాత్ కంపెనీలో పారిశ్రామిక ఉత్సవాలను మాజీ కార్పొరేటర్ పద్మావతి రెడ్డి నిర్వహించారు. కంపెనీలో పనిచేసే ఉద్యోగులకు బహుమతులు అందించి సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి ఇస్తున్న ప్రాముఖ్యతను ఆమె వివరించారు. పలువురు బీఆర్‌ఎస్ నాయకులు మహేందర్, హబీబ్, ఎంఎస్.రెడ్డి, అవినాష్, జహంగీర్ తదితరులున్నారు.

విద్యుత్ కాంతులతో ఫీవర్ ఆసుపత్రి !

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల వేడుకల సందర్భంగా నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆసుపత్రి ప్రధాన గేట్ నుంచి ఆసుపత్రిలోని అన్ని వార్డులు, ఇరువైపులా ఉన్న చెట్లు, సూపరింటెండెంట్ రూమ్, అడ్మిన్ కార్యాలయం పాథాలజీ ల్యాబ్ వరకు ఇరువైపుల విద్యుత్ లైట్లతో సుందరంగా అలంకరించారు.

– నల్లకుంట





విద్యుత్ కాంతుల్లో వెలిగిపోతున్న వార్డులు



ఫీవర్ ఆసుపత్రి మెయిన్ గేట్ వద్ద..